క్లుప్తంగా

బద్ది పోచమ్మకు బోనం సమర్పించిన నాగదుర్గ



నెత్తిన బోనంతో నాగదుర్గ, చిత్రయూనిట్ సభ్యులు

వేములవాడ: జగిత్యాల వాసి తెలంగాణ ప్రముఖ దర్శకుడు రాజ్‌నరేంద్ర డైరెక్షన్‌లో నాగదుర్గ హీరోయిన్‌గా కలివివనం అనే సినిమా షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్రయూనిట్ ఆధ్వర్యంలో వేములవాడలో బద్దిపోచమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. నెత్తిన బోనంతో ప్రధాన వీధుల గుండా నాగదుర్గ డప్పు చప్పుళ్ల మధ్య తరలివెళ్లారు. భక్తులు, స్థానికులు ఆమెతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో స్థానిక కళాకారులు మారం ప్రవీణ్, తాళ్లపెల్లి నాగరాజ్, గంగ శ్రీకాంత్, దప్పుల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో పరకాల ఎమ్మెల్యే



ఆలయంలో కోడె మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు

వేములవాడ: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వాములు స్వస్తితో స్వాగతం పలికారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా అర్చకులు శేష వస్త్రం కప్పి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ప్రోటోకాల్ ఏఈవో అశోక్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, సింహాచారి, మేకల వెంకటేశ్ ఆలయ సిబ్బంది ఉన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో వర్షాలు కురవాలని కోరుతూ గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. రైతులు బిందెలతో నీళ్లు తెచ్చి ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లోని విగ్రహాలపై నీళ్లు పోసి వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు.

ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముస్తాబాద్: ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లి, కట్టమైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు బంధు, మిత్రులతో వనభోజనాలకు తరలివెళ్లారు. గ్రామాల్లో ఆషాఢమాసం సందడి నెలకొంది.

మహిళా శక్తి సంబరాలు



బోనాలతో మహిళా సంఘం సభ్యులు

వీర్నపల్లి: మండలకేంద్రంలో జీవనజ్యోతి గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు నీలం కవిత ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో డీజే, డప్పుచప్పుళ్ల మధ్య సంబరాలు జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని పోచమ్మకు, పెద్దమ్మ, ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీశ్యామల, నర్సవ్వ, లక్ష్మి, దేశరాజు పద్మ వడ్లూరి రేణ, మంజుల, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గంభీరావుపేటకు చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కామారెడ్డి పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభా కాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. అబ్దు ల్ రజాక్, యూసుఫ్, జామా మసీదు అధ్యక్షుడు నవాబ్ ఖాన్, షరీఫ్‌లు పాల్గొన్నారు. గంభీరావుపేటలోని మా అనాథ వృద్ధుల ఆశ్రమంలో గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మత్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

వంతెన పనులకు మోక్షం

- రెండేళ్లుగా నిలిచిపోయిన గంజివాగు బ్రిడ్జి పనులు
- ఇటీవల ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ వంతెన పరిశీలన
- వారంలో పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు



అసంపూర్తిగా స్తంభంపల్లిలోని గంజివాగు హైలెవల్ వంతెన (ఫైల్)

బోయినపల్లి: బోయినపల్లి–వేములవాడ రోడ్డులో రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్న గంజివాగు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మోక్షం కలగనుంది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఈనెల 9న పరిశీలించారు. బ్రిడ్జి పనులు నిలిచిపోడంపై కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో పనులు ప్రారంభించి రెండు నెలల్లో వంతెన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో వంతెన పనులకు మోక్షం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. స్తంభంపల్లి గంజివాగు లోలెవల్ కల్వర్టు స్థానంలో రూ.1.80 కోట్ల అంచనాలతో హైలెవల్ వంతెన నిర్మాణానికి 2023 జూలైలో నిధులు మంజూరు చేశారు. 2023 ఆగస్టు 29న బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. నిర్మాణ పనుల్లో భాగంగా పిల్లర్లు వేసిన అనంతరం పనులు నిలిపివేశారు.

తెగిన తాత్కాలిక రోడ్డు

బ్రిడ్జి పనులను కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపివేయడం, పరిసరాలు సరిగా లేకపోవడంతో పలుసార్లు వాహనదారులు ప్రమాదాలబారినపడ్డారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా వేసిన తాత్కాలిక రోడ్డు గతేడాది వర్షాకాలంలో మూడుసార్లు తెగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. తాత్కాలిక రోడ్డు తెగిన సమయంలో బోయినపల్లి నుంచి వేములవాడ, వేములవాడ నుంచి బోయినపల్లి వెళ్లేవారు వయా అయ్యోరుపల్లి, రామన్నపేట, దేశాయిపల్లి మీదుగా ఐదు కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించారు.

కాంట్రాక్టర్‌పై ఆగ్రహం

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే సత్యం కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. వారంలో పనులు ప్రారంభించి, రెండు నెలల్లోపు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనికిముందే బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్ కోరడంతో పనులు చేయకముందే బిల్లు ఎలా ఇస్తారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తిచేస్తే బిల్లులు వచ్చే విధంగా చూస్తామన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ వంతెన పనుల ప్రారంభంపై సీరియస్‌గా ఉండడంతో త్వరలో పనులు ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ తెలిపారు.

కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ దృష్టికి పలుసార్లు తీసుకెళ్లాం. దీంతో వారు బ్రిడ్జిని సందర్శించి పీఆర్ ఈఈ, కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు.

–పులి లక్ష్మీపతి, మాజీ జెడ్పీటీసీ, బోయినపల్లి

త్వరగా పనులు చేపడుతాం



స్తంభంపల్లి హైలెవల్ బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. లేబర్‌ను కాంట్రాక్టర్ పిలిచారు. త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– కే.విష్ణువర్ధన్, పీఆర్, డీఈ, వేములవాడ

ఇందిరమ్మ లబ్ధిదారుల ఆందోళన



చిన్న బోనాలలో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

సిరిసిల్ల అర్బన్: పట్టణ పరిధిలోని చిన్న బోనాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు ఇసుక ధర ఉండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేదు, ఉచితంగా అందజేస్తామని ఓ వైపు ప్రభుత్వం చెప్పుతున్నా క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇసుక అధిక ధర కావడంతో పదో వార్డులోని 26 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి ఇసుక ధరను తగ్గించి లబ్ధిదారులపై అధిక భారం పడకుండా చూడాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో సలేంద్రి దేవయ్య, చలిమెల వెంకన్న, చల్ల శ్రీకాంత్, దు వ్వాల లక్ష్మి, బండారి రవి, పడిగె రాజనర్సు, తుమ్మల సుధాకర్, ప్రమోద్, సుమన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఈవో



వేములవాడఅర్బన్: రాజన్న ఆలయానికి సంబంధించి నాంపల్లి శివారులోని గురువయ్య నగర్ సమీపంలోని ఆలయ భూమిలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రాజన్న ఆలయ ఈవో రాధాబాయి మొక్కలు నాటారు. అనంతరం తిప్పాపూర్ గోశాలలోని కోడెలను పరిశీలించారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంను సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె చేస్తాం



ఇల్లంతకుంట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్త సమ్మె చేపడుతామని జిల్లా మధ్యాహ్న భోజన కార్మికుల ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు వంట పాత్రలు సరఫరా చేయాలని, గ్యాస్ సిలిండర్లు, సదుపాయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జి.రాజు, సంతోష, బాలమణి, బాలవ్వ, మల్లవ్వ, వరలక్ష్మి, పోచవ్వ, జనవ్వ, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ ఈసీ సభ్యులుగా నలుగురి ఎంపిక

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఈసీ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వైస్ ప్రెసిడెంట్, టెక్నికల్, ఈసీ మెంబర్లుగా నలుగురిని ఎన్నుకున్నట్లు నూతనంగా ఈసీ సభ్యుడిగా ఎన్నికైన మల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా సంపత్‌రావు, ఈసీ మెంబర్‌గా మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, టెక్నికల్ కమిటీ మెంబర్‌గా మల్లేశ్‌గౌడ్ ఎన్నికైనట్లు తెలిపారు.

సీఎంను కలిసిన చొక్కాల రాము



సిరిసిల్ల టౌన్ : సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న చొక్కాల రాము



ముస్తాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మట్ట రాజేశ్వర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: సీఎం రేవంత్‌రెడ్డిని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఆదివారం కలిశారు. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని హర్షిస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు రాము శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు నీలం మధు తదితరులున్నారు.

టీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు

ముస్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసినట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. టీడీఎఫ్ ద్వారా రాష్ట్రంలో ఇరవై ఐదుఏళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను సీఎంకు వివరించినట్లు తెలిపారు. మహిళాభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్, రైతులకు సాగు, సేంద్రియ ఎరువులవల్ల కలిగే లాభాలను వివరించామన్నారు. టీడీఎఫ్ చేస్తున్న కృషిని సీఎం అభినందించినట్లు పేర్కొన్నారు.

అడవులను కాపాడుకోవాలి

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రకాశ్ సీతాఫల విత్తనాలు చల్లాడు. సుద్దాలకు చెందిన ప్రకాశ్ గతేడాది నుంచి సేకరించిన సుమారు 48 కిలోల సీతాఫల విత్తనాలను ఆదివారం మధ్యాహ్నం వరకు అటవీ ప్రాంతంలో వెదజల్లాడు. ప్రకాశ్ గతంలో డ్రోన్ల ద్వారా శివంగాలపల్లి, మల్కపేట గ్రామాల్లో విత్తన బంతులను చల్లాడు. అడవులను కాపాడుకోవాలని, అంతరించిపోతున్న అడవులను పెంచేందుకు తన వంతుగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

అక్రమ మట్టి, ఇసుక రవాణాపై చర్యలు

వేములవాడఅర్బన్: జిల్లాలో అక్రమ మట్టి, ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. వేములవాడ శివారులోని కొడిముంజ, అనుపురం గ్రామ పరిసరాల్లో 10 మట్టి తవ్వే యంత్రాలు, వాహనాలను వేములవాడ ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి ఆదివారం సీజ్ చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అని బ్యానర్‌తో అక్రమంగా మట్టి తరలిస్తున్న 4 టిప్పర్లు, 2 ట్రాక్టర్లు, 2 జేసీబీలు, 2 హిటాచి యంత్రాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

గంభీరావుపేట: పొలంలో తాను పనిచేస్తుండగా అసభ్యపదజాలతో దూషించి దాడిచేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమకాంత్ తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన బండారి బాలమల్లుపై నర్ర మల్లేశం, నర్ర అజయ్, నర్ర యాదవ్వ దాడి చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేటలో ఆదివారం మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో పెనుప్రమాదం తప్పింది. రాజన్నపేటకు చెందిన ధ్యాప రాములు తన ట్రాక్టర్‌లో ఇందిరమ్మ ఇండ్లకు మట్టిని తరలిస్తున్నాడు. ఈక్రమంలో సాయంత్రం మట్టితో వెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

నూతన కార్యవర్గం



సిరిసిల్ల: పట్టణంలోని సర్దార్‌నగర్ గురుకులాశ్రమ హనుమాన్ ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా చిటికెన శ్రీనివాస్, కోశాధికారిగా ఏనుగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బూట్ల సతీశ్, అన్నల్‌దాస్ రామ్ బాబు, సహాయ కార్యదర్శిగా చింతకింది మల్లికార్జున్, ప్రచార కార్యదర్శిగా వెంగళ భాస్కర్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని స్థానికులు వేసి సత్కరించారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణ గూడ్స్ ఆటో యూనియన్ (సర్దార్ నగర్) అధ్యక్షుడిగా అకేని సతీశ్, కోశాధికారిగా జల్లి రాజును ఎన్నుకున్నారు. తమ నియమకానికి సహకరించిన యూనియన్ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా విట్టల్

ముస్తాబాద్ : మండల ముది రాజ్ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ముస్తాబాద్‌కు చెందిన పిట్ల విట్టల్ ఎన్నికయ్యారు. గూడెం గ్రామానికి చెందిన శ్రీనివాస్ విట్టల్‌కు మధ్య పోటీ నెలకొంది. 24 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోగా విట్టల్ రెండు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ముదిరాజ్ సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని, తన విజయానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం..



విలాసాగర్ పద్మశాలీ సంఘం కార్యవర్గం

బోయినపల్లి: విలాసాగర్ శ్రీ మార్కండేయ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించినట్లు సంఘం నాయకులు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా బూర నాంపెల్లి, అధ్యక్షుడిగా కొక్కుల అశోక్, ప్రధాన కార్యదర్శిగా బూర మహేశ్, ఉపాధ్యక్షులుగా మేరుగు రమేశ్, కోశాధికారిగా పాశికంటి వెంకటేశం, సంయుక్త కార్యదర్శులుగా మా మిడాల శ్రీనివాస్, వేముల నరేందర్, గౌరవ సలహాదారులుగా కొక్కుల శంకరయ్య, వేముల మహేందర్, కొక్కుల పర్శరాములు, దాసరి స్వదేశ్, తడక భాస్కర్, గుండ్లపెల్లి సుధాకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ముస్తాబాద్: ముస్తాబాద్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై గూడెం, నామాపూర్ గ్రామాల మధ్య మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో మానేరు కెనాల్ వద్ద ఉన్న మలుపు వద్ద పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గతేడాది ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
శాంతయ్య, డీఈఈ, సెల్‌నెంబర్: 9440818420

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీసీ రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే



గంభీరావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోనరావుపేటలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని, బీసీ రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాంచంద్రారెడ్డి, భూమరాజం, రాజశేఖర్, అక్కపల్లి బాలయ్య, రాజనర్సు, ప్రభాకర్, మేడ భాస్కర్, పంతం సురేశ్, భాస్కర్, గౌరీశంకర్, వెంకటి, వల్లయ్య, లక్కంపల్లి నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. మండలకేంద్రంలో ఏర్పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాకులు కాల్చి సంబరాలు జరిపారు. . కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం శోచనీయం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: జిల్లాలో ప్రొటోకాల్ పాటించాల్సిన జిల్లా అధికారి స్వయంగా ప్రోటోకాల్ ఉల్లంఘించడం శోచనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లెల్లలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పంపిణీ అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటోను ఫ్లెక్సీలో ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా అధికారి నిత్యం బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తూ కాంగ్రెస్ నాయకుడిలా ప్రవర్తిస్తున్నాడన్నారు. అధికారిక కార్యక్రమాల ఫ్లెక్సీల్లో కేటీఆర్ ఎందుకు పెట్టడం లేదో కలెక్టర్, ఎంపీడీవో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏ పదవిలేని కేకే.మహేందర్ రెడ్డిని కలెక్టర్ పక్కనే కూర్చివేసి పట్టాలు పంపిణీ చేయడం ఏంటన్నారు. గృహ నిర్మాణాలకు ఇసుక దొరక్క ఇబ్బంది పడుతుంటే కలెక్టర్ ఇసుకకు కొరత లేదని చెప్పడం ఏంటో తెలపాలన్నారు. మండల వాసులకు తంగళ్లపల్లి ఇసుక రీచ్ నుంచి కేటాయించాలని కోరారు. ప్రజలకు ఇసుక అందుబాటులోకి వచ్చేలా అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, నాయకులు బండి జగన్, కుర్మ రాజయ్య, మహేశ్ యాదవ్, అఫ్రోజ్, ప్రేమ్ కుమార్, శ్రీవర్ధన్, నవీన్ రెడ్డి, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో ఆదివారం పోచమ్మ బోనాలను విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయం నుంచి పోచమ్మ ఆలయం వరకు డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. సంతోష్ ,శ్రావణ్ కుమార్, భాస్కర్, శ్రీనివాస్, చారి, తదితరులు పాల్గొన్నారు.

- **సీసీరోడ్డు పనులు ప్రారంభం**

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ ఆరో వార్డులో సీసీరోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. మండలానికి రూ.కోటి 30లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించారని బీజేపీ నాయకులు తెలిపారు.

- **రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మొదటి బైపాస్‌రోడ్డులో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన రాజు, దండు శివ బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా కోరుట్లపేటకు చెందిన ఒకరు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో రాజు, శివ గాయపడ్డారు.

గొర్రెల మంద అప్పగింత

రుద్రంగి: రుద్రంగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. తప్పిపోయి సంచరిస్తున్న గొర్రెల మందను గమనించి గెంటె మల్లయ్యకు చెందిన గొర్రెలుగా గుర్తించారు. సుమారు రూ.5 లక్షలు విలువ చేసే గొర్రెల మందను మల్లయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి మల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.